


ఏడులక్షలు!

సామాన్యమైన మొత్తమేం కాదు. నాలాంటి సగటు మానవుడు జీవితాంతం కష్టపడినా కూడా ఒక్కసారిగా అంత డబ్బు కళ్లజూడలేడెప్పుడూ.

కాబట్టి డబ్బు విలువ తెలుసుకుని ప్రతి పైసానీ ఆచితూచి ఖర్చుపెట్టాలి. ఉందికదాని విచ్చలవిడిగా వెదజల్లేయకూడదు.

అసలు ఒక్క పైసా మాత్రం ఎందుకు ఖర్చుచేయాలి? మొత్తం అంతా బ్యాంక్‌లో వేసేసి వచ్చే వడ్డీని మాత్రమే ఖర్చు పెట్టుకుంటూ ఉంటే పోలా-

మంచి ఆలోచన. కానీ అంత డబ్బు ఉంచుకుని కూడా ఇంకా అద్దె కొంపలో అగచాట్లు పడడం ఏంటి? గోడకి మేకు కొడితే తప్పు. గట్టిగా అరిస్తే తప్పు. చివరకి టీవీ సౌండ్ పెంచినా తప్పే. ఎన్నాళ్ళీ ఆంక్షల బ్రతుకు.

సో...రెండూ, రెండున్నర లక్షల్లో ఒక చిన్న ఇల్లేదైనా కొనుక్కుంటే పోలా. అవును..ఆ పనే చేయాలి. రెండున్నర లక్షల్లో నివాసయోగ్యమైన ఇల్లు దొరక్కపోదు. శారద కూడా సంతోషిస్తుంది. అద్దె కొంప కాబట్టేగా పాపం ప్రతిరోజూ తనకి ఇంటిగలావిడతో జగడం. ఎన్నాళ్లిలా అరిచి అరిచి అవస్థలు పడుతుంది.

ఇంటికోసం రెండున్నరపోయినా ఇంకా నాలుగున్నర లక్షలుంటాయి. అందులోంచి ఇంకో లక్ష తీసి ఇంటికి కావలసిన ముఖ్యమైన వస్తువులన్నీ కొనేసుకోవాలి.

ముఖ్యంగా ఫ్రిజ్ కావాలి. అలాగే ఓ ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషీన్. వ్యాక్యూమ్ క్లీనర్ లాంటివి ముఖ్యమేం కాదు. కాబట్టి కొనకపోయినా ఫర్లేదు. బట్టలది ఏముంది చేత్తోనైనా ఉతికేసుకోవచ్చు. అలాగే ఇల్లుదేముంది చీపురుతోనైనా ఊడ్చేసుకోవచ్చు.

సో... అవి రెండింటినీ పక్కన పెట్టి ప్రస్తుతం ఉన్న ఈ నవ్వారు మంచాలు తీసేసి రెండు డబుల్ కాట్స్ కొనాలి. ఒకటి పిల్లలకి, రెండోది మా ఇద్దరికీ. ఇక పోతే మోపెడ్ అమ్మేశాక మళ్ళీ బండి కొనుక్కోలేకపోయాను. చచ్చీచెడీ ఆఫీసుకి సిటీబస్సుల్లో వెళ్లాల్సొస్తోంది. కాబట్టి వేస్ట్ అనుకోకుండా పాతికవేలు పెట్టి ముందో స్కూటర్ కొనెయ్యాలి. పది పన్నెండు వేలల్లో సెకండ్ హ్యాండ్ బండ్లు దొరుకుతాయి.

కానీ మళ్ళీ కొనుక్కునే వస్తువు కాదు కాబట్టి బ్రాండ్ న్యూ కొనుక్కోవడమే బెటర్. అదీగాక సంచీలాభం చిల్లు పూడ్చిందన్నట్లుగా ఖరీదు తక్కువ కదాని సెకండ్ హ్యాండ్ బండి కొనుక్కుంటే ఆ తర్వాత రిపేర్లకి పొయ్యలేక చావాలి.

మా కొలీగ్ కరుణమూర్తి సెకండ్‌హ్యాండ్‌వి కొని ఎన్ని అవస్థలు పడుతున్నాడో ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాగా మళ్ళీ అదే తప్పు నేను కూడా చెయ్యాల్నా?

సో..కొత్త బండే బెస్టు.

జీతం ఎలాగూ ఓ మూడువేల అయిదొందలు వస్తూనే ఉంది కాబట్టి అదీ ఇదీ కలిపి లోటులేకుండా బ్రతికేయొచ్చు.

ఏడులక్షల్ని ఎలా సద్వినియోగం చెయ్యాలా అని నేనలా ఆలోచిస్తుండగా-

"ఏవండీ. వస్తున్నాడండీ రాక్షసుడు" అంటూ వరండా మీంచి హాల్లోకొచ్చింది మా ఆవిడ.

"నేను బాత్‌రూంలో దూరిపోతాగానీ లేనని చెప్పి సర్ది పంపెయ్" అన్నాను కంగారుగా.

"అరుస్తాడేమోనండీ..." అంది భయంగా.

"అరిస్తే అరవనీ. ఏంచేస్తాం మరి?" అంటూనే నేను బాత్‌రూంలోకి దూరిపోయాను.

అదృష్టం. నేనలా లోపలికి దూరి తలుపేసుకున్నానో లేదో వచ్చేశాడు రాక్షసుడు.

"ఏమ్మా! మీ ఆయన లేడా?" అంటూ.

"లేరండీ. ఇందాకే అలా బజారుకెళ్లారు" అంది మా ఆవిడ.

"రాగానే వచ్చి నాకు కనబడమని చెప్పమ్మా. పోయిన్నెల్లోనే ఇంటద్దెలో అయిదొందలు బకాయి పెట్టాడు. ఈ నెలదైతే మొత్తానికే ఇవ్వలేదింకా. నేను చేరేటప్పుడే చెప్పానుగా ఠంచనుగా ఫస్ట్ తారీఖుకల్లా అద్దె ఇవ్వాలని. ఇలా చేస్తే ఎలా?" అంటూ హూంకరించాడు రాక్షసుడు.

"పోయిన్నెల్లో మా ఇంటికి చుట్టాలు రావడం వల్ల..." అంటూ ఏదో చెప్పబోయింది శారద నచ్చచెబుతున్న ధోరణిలో.

తన పిచ్చిగానీ రాక్షసులకలాంటి సాధకబాధకాలన్నీ అర్థమై ఛస్తాయా?

ఆయనగారు అనాల్సిన మాటలన్నీ అన్నాకే వెళ్లాడు.

దుర్మార్గుడు దున్నపోతు జన్మ!

నేనేమన్నా ప్రతినెలా లేటు చేస్తానా? ఏదో ఏడాదికి ఒకటి రెండుసార్లు, మహా అయితే నాలుగైదుసార్లు.

ఆపాటి దానికే ఓర్చుకోలేకపోతే ఎలా? పాపిష్టోడు....నాలో నేను శుభ్రమైన తెలుగులో గొణుక్కుంటూ బాత్‌రూంలో నుండి తొంగిచూశాను.

"ఆయన వెళ్లిపోయాడు. ఇంక బైటికి రండి" అంది మా ఆవిడ బాత్‌రూం తలుపు దగ్గరికొచ్చి.

'హమ్మయ్య..' అనుకుంటూ బైటపడి నేను మళ్లీ సోఫాలో చేరిపోయి షర్ట్ జేబులోంచి రాయల్ భూటాన్ బంపర్‌లాటరీ టిక్కెట్‌ని బయటికి తీశాను.

ఫస్ట్ ప్రైజ్ పదిలక్షలు.

ఓ మూడులక్షలు ట్యాక్స్ పోతే ఏడులక్షలు చేతికొస్తాయి. ఒకవేళ అదృష్టం నన్నే వరించి ఆ ఏడులక్షలూ నా చేతికి వస్తే-

వాటినెలా సద్వినియోగం చెయ్యాలా అని మళ్ళీ ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. ఏడులక్షలు కళ్లముందు నోట్ల కట్టలతో గిర్రున తిరిగాయి.

వంటింట్లోంచి శారద ఏదో గొణుగుతూ ఉంది.

★